ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# దిగంబర కవిత్వం – గమనం – గమ్యం

డాక్టర్ చాట్ల కిషోర్

తెలుగు శాఖ అధ్యక్షులు,కాకాని వెంకటరత్నం కళాశాల నందిగామ. ఎన్టీఆర్ జిల్లా

సెల్ 9866820524

Received: 20/05/2026
Article Accepted: 03/06/2026
Published Online: 05/06/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.155

**సారాంశం**

తెలుగు సాహిత్య చరిత్రలో దిగంబర కవిత్వం ఒక విప్లవాత్మక సాహిత్యోద్యమంగా గుర్తింపు పొందింది. 1960లలో సమాజంలో నెలకొన్న కపటత్వం, అసమానతలు, రాజకీయ అవినీతి, సాంస్కృతిక జడత్వం వంటి పరిస్థితులకు ప్రతిస్పందనగా ఈ ఉద్యమం ఆవిర్భవించింది. నిఖిలేశ్వర్, నగ్నముని, జ్వాలాముఖి, చెరబండ రాజు, మహాస్వప్న, భైరవయ్య వంటి కవులు దిగంబర కవులుగా సమాజంలోని వాస్తవ పరిస్థితులను నిర్భయంగా ఆవిష్కరించారు. బీట్ జనరేషన్, యాంగ్రీ యంగ్ మెన్ ఉద్యమం, హంగ్రీ జనరేషన్ వంటి అంతర్జాతీయ ఉద్యమాల ప్రభావంతో రూపుదిద్దుకున్న ఈ కవిత్వం వ్యక్తి అస్తిత్వం, సామాజిక చైతన్యం, మానవ విలువలు, తిరుగుబాటు స్వభావం వంటి అంశాలను ప్రధానంగా ప్రతిపాదించింది. సంప్రదాయ సాహిత్య ధోరణులను సవాలు చేస్తూ ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త భాషా శైలిని, కొత్త భావవ్యక్తీకరణను ప్రవేశపెట్టింది. మార్క్సిస్టు తాత్విక దృక్పథాన్ని స్వీకరించి సామాజిక మార్పు కోసం సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించింది. ఈ విధంగా దిగంబర కవిత్వం తెలుగు సాహిత్యంలో విప్లవ కవిత్వోద్యమానికి పునాది వేసి, సమకాలీన సమాజాన్ని ప్రశ్నించే శక్తిగా నిలిచింది. ఈ వ్యాసం దిగంబర కవిత్వం యొక్క ఆవిర్భావం, వికాసం, తాత్విక దృక్పథం, సామాజిక ప్రాసంగికత మరియు అంతిమ లక్ష్యాన్ని విశ్లేషిస్తుంది.

**కీలక పదాలు:**దిగంబర కవిత్వం ,సాహిత్యోద్యమం ,సామాజిక చైతన్యం ,మార్క్సిస్టు దృక్పథం ,విప్లవ సాహిత్యం

"నన్నయ్యను నరేంద్రుడి బందులోనే నిద్రపోని/ లేపకు పీక నులిమి గోతులోకి లాగుతాడు/
ప్రబంధాంగనల తొడలు తాటి మొద్దులు / తాకితే కాళ్లు విరగొట్టు/

కుచములు ఎవరు ఎక్కని పర్వతాగ్రములు/ తలను ఢీకొని బద్దలు కొట్టు/
పండితవర్యా ! రికార్డు లా నోరు త్రిప్పకు / నవ సృష్టిని కాలదన్నకు/
భావకవుల నపుంసక హావభావాలకు సవాలు/ అభ్యుదయకవి నల్లమందు తిని నిద్ర పోయావ్/
నయాగరా జలపాతం లో దూక లేకపోయిన అన్నయ్యా! గుడ్ బై !
మీకందరికీ సలాం వాలేకుం/ వచనం లేదు! కవిత్వం అంతకంటే లేదు....'

అంటూ వెయ్యేళ్ల తెలుగు సాహిత్యాన్ని ఈ సడించుకుంటూ.... "దిగంబర కవితలో మరొకడు - నిండుగా నిజంగా ఊపిరి పీల్చేవాడు ఆత్మ యోని నుండి పుట్టుకొస్తున్నాడు". (ఆత్మ యోని :నిఖిలేశ్వర్) అంటూ సాహిత్యంలోనికి దిగంబరంగా దూసుకు వచ్చిన వారు దిగంబరకవులు..

**ఉపోద్ఘాతం:** ఈ దేశంలో, ఈ గోళంలో ఊపిరి పీల్చే ప్రతి మనిషి ఉనికి కోసం తపనపడి అతడి భావిని చూసి వెక్కివెక్కి ఏడ్చి పిచ్చెక్కి ప్రవచించిన కవిత ఈ దిగంబర కవిత. యాదవ రెడ్డి మానేపల్లి రిషికేశవరావు వీర రాఘవచార్యులు కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు మన్మోహన్ సహాయ్ బద్దం భాస్కర్ రెడ్డి అనే ఆరుగురు కుర్రాళ్ళు నిఖిలేశ్వర్ నగ్నముని జ్వాలాముఖి మహా స్వప్న భైరవయ్య చెరబండ రాజు అనే మారుపేరులతో దిగంబర కవులుగా ప్రసిద్ధి చెందారు. వీరు దిగంబర శకం అనే పేరుతో కాలాన్ని కొత్తగా విభజిస్తూ రుతువులను పేరు మార్చి, సంవత్సరాలకు కూడా కొత్త పేర్లను పెట్టి తమ నూతన శకాన్ని ప్రారంభించారు. దిక్కు అనే పేరుతో మూడు కవిత సంపుటాలను వెలువరించారు. 1965 మే 6వ తారీఖున అర్ధరాత్రి హైదరాబాదులో నాంపల్లి పండు అనే రిక్షా కార్మికుని తో మొదటి సంపుటిని ఆవిష్కరింపజేశారు

1966 డిసెంబరు 8న రెండో సంపుటిని విజయవాడలో జంగాల చిట్టి అనే హోటల్ కార్మికునితో ఆవిష్కరింపజేశారు. మూడో సంపుటిని 1968 సెప్టెంబర్ 14న అర్ధరాత్రి 12 గంటలకు విశాఖపట్నంలో ఎడమనూరు యశోద అనే బిచ్చగత్తెతో ఆవిష్కరింపజేశారు. ఈ విధంగా పుస్తకావిష్కరణలోనే వీరు ఒక నూతన పంథాను అనుసరించి సంచలనం సృష్టించారు. సుమారుగా 93 కవితలు ఈ ఆరుగురు రచయితలు దిక్కులు అనే పేరుతో తెలుగు సాహితీ లోకంలో ప్రకంపనలు సృష్టించారు. మొదటిది దిగంబర శకం నగ్న నామ సంవత్సరం ఆశా రుతువు సరిగ్గా 1965 మే 6న తాము దిగంబరకవులమని ప్రకటిస్తూ ఈ ప్రాపంచిక ఆచ్ఛాదనలను చీల్చుకుని కొత్త రక్తాన్ని ఇంజెక్ట్ చేయడానికి వస్తున్న నగ్నముని నిఖిలేశ్వర్ జ్వాలాముఖి చెరబండ రాజు భైరవయ్య మహా స్వప్న గుండెల్లో నుంచి ధైర్యంగా ధైర్యంగా దూసుకొచ్చిన కేకల్ని ఈ పేజీల్లో పట్టుకోడానికి ప్రయత్నించిన దిగంబర కవితల సమర్పణ అని పేర్కొన్నారు. "మేం ఆరుగురం మాలోని నిజరూపాలను దర్శిస్తూ మా చుట్టూ ఉన్న మనుషులందరినీ ప్రేమిస్తూ వాళ్లను కూడా

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ఆ ప్రయత్నం చేయమంటున్నాం. మంచి కోసం మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషి కోసం కపటం లేని చిరునవ్వులు చిందే సమాజం కోసం అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మలలోంచి పలుకుతున్న గొంతు కులం మేము పుస్తకాల్లో నుంచి మాట్లాడదలచుకోలేదు. అనుభవాల్లోంచి పలక దలుచుకున్నాం. మా దిగంబర గొంతుకులతో చెప్పదలుచుకున్నాం" అని దిగంబర కవులు స్పష్టం చేశారు. (పుట 23 దిగంబర కవులు) ఇది దిగంబర శకం మేం దిగంబరకవులం మాది దిగంబర కవిత. ఇది సాహిత్యంలో దిగంబర కవితోద్యమం అని దిగంబర కవిత్వాన్ని ఉద్యమ స్థాయికి తీసుకువెళ్లాలని ఆశించారు.

**నేపథ్యం:** 1943 ప్రాంతాల్లో ప్రారంభమైన అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యంలో సంచలనం సృష్టించింది. అభ్యుదయ కవిత్వోద్యమ మూల విరాట్ గా శ్రీశ్రీ మహాప్రస్థానం చూపించిన దారిలో అనేక మంది కవులు నడిచి సాహిత్యానికి సామాజిక ప్రయోజనం కంటే మించింది లేదని సమకాలీన రాజకీయ అంశాలను సామాజిక అంశాలను కవిత్వంలోనికి లాగి గొప్ప కవిత్వాన్ని సృష్టించారు. శ్రీ శ్రీ ఆరుద్ర వంటి అభ్యుదయ కవులు. ఈ విధంగా కొనసాగిన అభ్యుదయ కవిత్వోద్యమం 1955 నాటికి పాతబడిపోయింది. అభ్యుదయ కవులందరూ సినిమాల్లో స్థిరపడిపోయారు. అదే సమయంలో వచ్చిన 1955 సాధారణ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రభావం చూపలేకపోవడం చేత అభ్యుదయ కవులలో చైతన్యం సన్నగిల్లింది. చివరి దశలో దాశరథి మహాంధ్రోదయం కుందుర్తి తెలంగాణ రెంటాల సర్పయాగం వంటి అభ్యుదయ కవితా సంపుటాలు వచ్చినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ దశలో అటు సమాజంలోనూ ఇటు సాహిత్య రంగంలోనూ నెలకొన్న స్తబ్దత సుమారుగా పదేళ్లపాటు కొనసాగింది. మోసం దగా కుట్రతో సమాజం నిండిపోయింది. అంతా నటన మాయ అలవాటయింది. మనిషి నటనలో పుట్టి నటనలో పెరిగి నటనలో చస్తున్నాడు. మిమ్మల్ని మీరు పుట్టగానే మరిచిపోయారు. పుట్టగానే వార్ధక్యంలో పడిపోయారు అని, కీర్తి డబ్బు ఇనప బూట్ల క్రిందపడి నలిగి కొన ఊపిరితో గిలగిలా కొట్టుకుంటున్న మీ అసలు స్వరూపాన్ని ఎన్నడైనా, ఒక్కనాడు అయినా చూసుకున్నారా? అని దిగంబరకవి ప్రశ్నించాడు. పెళ్ళానికి మొగుడిగా నటన మొగుడికి పెళ్ళాంగా నటన ఆఫీసుల్లో ఓట్లూహాడావుడిలో కాకారాయుళ్లుగా నటన, మీ బిడ్డలకి గొప్ప తల్లిదండ్రులుగా నటన, పక్క వాడిని చూసి ఏడుపు, ప్రమోషన్ లేదని గోల, మీ మనసంతా చెదర.. ఎక్కడా వంగి దండాలే మీ బతుకు. నక్క వినయాలే మీ పెట్టని భుజకీర్తులు.

ఈ విధంగా నటిస్తూ ముసుగుల్లో జీవిస్తున్న వారిని అసహ్యించుకుంటూ ఉద్యమం లేవదీశారు. దిగంబరకవులు మొదటి సంపుటిలోనే ఈ కాలమానస్థితిని అసహ్యించుకుంటూ... కాలం మారింది. జీవిత విధానం మారింది. అనుభవాల ఆకారం మారింది. మీరు ఊపిరి పీలుస్తున్న ప్రపంచంలో మీరు లేరు. మీరు

ఎప్పుడో చచ్చి రోడ్ల పక్కన బురద గుంటలో దొర్లుతున్నారు. కూతుళ్లు కొడుకుల పెళ్లిళ్ల భాజాల్లో, సిమెంట్ కాంట్రాక్టుల కాగితాలలో మనిషి అంటే డబ్బు డబ్బు. ఆడది అంటే రాత్రి తన కింద పడుకునే డబ్ల పిల్లో అనుకునే మీరు ఏనాడో చచ్చారు అంటారు దిగంబర కవులు. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా మారిన సామాజిక రాజకీయ పరిస్థితులు ఎంతో కొంత దిగంబర కవిత్వం మీద తమ ప్రభావాన్ని చూపించాయి. వాటిలో మొదటిది బీట్ జనరేషన్. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సమాజంలో నెలకొన్న మూసధోరణులను వ్యతిరేకిస్తూ అమెరికాలో బీట్ జనరేషన్ మొదలైంది. 1950 దశకంలో జాక్ కిరువాక్, అలన్స్ గిన్స్బర్గ్, విలియం ఎస్ బరుస్ మొదలైన రచయితలు ఈ వాదానికి పునాది వేశారు. సనాతన ఆచారాలు ప్రాచీన సంప్రదాయాలు సామాజిక కట్టుబాట్లు తెంచుకొని స్వేచ్ఛగా బ్రతకాలని ఈ బీట్ జనరేషన్ ఆశించింది. కొంత అరాచకత్వాన్ని కూడా ఇది ప్రేరేపించింది అంటే మాదకద్రవ్యాల వినియోగం, లైంగిక స్వేచ్ఛ విపరీతమైన శబ్దాలతో కూడిన సంగీత ప్రియత్వం మొదలైనవి ఇందులోని ప్రధాన అంశాలు. ఈ ఉద్యమంలో ప్రధాన రచయిత జాక్ కేరువాక్. ఈయన రాసిన ఆన్ ది రోడ్ అనే నవల ఈ ఉద్యమానికి వెన్నెముక లాంటిది. బీట్ అనే పదాన్ని నిర్వచిస్తూ ఈయన బీట్ అంటే సమాజం వల్ల అణచివేయబడటం (beatendown ) అన్నారు.

1960లో వచ్చిన హిప్పీ సంస్కృతికి ఈ బీట్ సంస్కృతి పునాదివేసింది. దిగంబరోద్యమాన్ని ప్రభావితం చేసిన రెండోది యాంగ్రీ యంగ్ మెన్ ఉద్యమం. 1950 లోనే లండన్ లో ఈ యాంగ్రీ యంగ్ మాన్ మూమెంట్ ప్రారంభమైంది. జాన్ ఓస్ బర్న్ అనే రచయిత లుక్ బ్యాక్ ఇన్ యాంగర్ అనే నాటకం రాశారు. ఇది రాయల్ కోర్టు థియేటర్లో ప్రదర్శితమైంది. దాని తర్వాత ఈ పదం బాగా ప్రాచుర్యంలోనికి వచ్చింది. సమాజంలోని మధ్యతరగతి జీవితాల నిస్సహాయ స్థితులను చైతన్య రాహిత్య స్థితిని ఈ ఉద్యమ రచయితలు తీవ్రంగా నిరసించారు. పైగా ఈ సమయంలో నిరుద్యోగిత తీవ్రమై ఉన్నత విద్యావంతులను సైతం నిరాశకు గురి చేయడం, మూలంగా కలిగిన ఆవేశం ఆయా రచనల్లో ప్రతిఫలించింది. ఈ ఉద్యమ కాలంలో కిచెన్ సింక్ రియలిజం అనే కొత్త భావజాలం రచయితల్ని కళాకారుల్ని ముందుకు నడిపించి సమాజాన్ని నూతన దృక్కోణం నుండి చూసేటట్టు చేసింది. అదేవిధంగా సమాజానికి దర్పణంగా నిలిచే నాటక రంగాన్ని ఇది బాగా ప్రభావితం చేసింది విలాసవంతమైన డ్రాయింగ్ రూములలో కాకుండా పేద మధ్యతరగతి ప్రజల సాధారణ ఇళ్ళలో జరిగే యదార్థ సంఘటనలను వారి ఆశను వారి శ్రమలు దుఃఖాలు వేదనలు కష్టాలు అన్నింటిని కళ్ళకు కట్టేట్టు రాసి సమాజానికి కనువిప్పు కలిగేటట్టు చేశారు . జాన్ ఓస్ బర్న్ ఈ ఉద్యమానికి మూల స్తంభం. అయితే కింగ్స్ లీ అమిష్ అనే రచయిత రాసిన లక్కీ జిమ్, అలిన్

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

సిల్లీ టో రాసిన సాటర్డే నైట్ అండ్ సండే మార్నింగ్ వంటి రచనలు కూడా రచయితలపై, సమాజంపై గొప్ప మార్పు చూపించాయి. ఇది కూడా ఒక విధంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ పోకడలు నిరసిస్తూ వచ్చిన బీట్ ఉద్యమం వంటిదే అనుకోవచ్చు.

దిగంబర కవిత్వాన్ని ప్రభావితం చేసినట్టు చెబుతున్న మరో ఉద్యమం హంగ్రీ జనరేషన్ ఉద్యమం. ఇది 1960లలో కోల్కతాలో ప్రారంభమైన ఒక విప్లవాత్మక సాహిత్య సాంస్కృతిక ఉద్యమం. శక్తి చెటోపాధ్యాయ మలయ్ రాయ్ చౌదరి, సమీర్ రాయ్ చౌదరి దేబి రాయ్ నేతృత్వంలో వచ్చిన ఈ ఉద్యమం బెంగాలీ సాహిత్యంలోని సాంప్రదాయకతను ప్రశ్నిస్తూ నాటి సమాజంలోని అశాంతిని ప్రతిబింబిస్తూ ఆధునికంగా ఆలోచించడం మొదలు పెట్టింది. ఈ ఉద్యమాన్ని హంగ్రీలిస్టు  క్వార్టేట్ అని పిలిచే నలుగురు వ్యక్తులు ప్రారంభించారు. ఆనాటి సాహిత్యంలో ఉన్న నిశ్శబ్దాన్ని, స్థిరత్వాన్ని ఛేదించి సామాజిక రాజకీయ వ్యక్తిగత నిరాశను తమ రచనల ద్వారా వ్యక్తపరచడం ఈ ఉద్యమ నిర్మాతల లక్ష్యం. ఈ ఉద్యమం బెంగాలీ సాహిత్యంలో కొత్త తరహా కవిత్వం, కథానికలను తీసుకొచ్చింది. తీవ్రమైన విమర్శలను కూడా ఎదుర్కొంది. ముఖ్యంగా 1943 నాటి బెంగాల్ కరువు పరిణామాల నేపథ్యంలో సమాజంలో  కలిగిన ఆకలి నుంచి ఇది పుట్టింది. 1961 నవంబర్లో పాట్నాలో మలై రాయి చౌదరి మరియు అతని సోదరుడు సమీరాయి చౌదరి దీనిని ప్రారంభించారు. జాఫ్రి చార్జర్ రాసిన ఇన్ షవర్ హంగ్రీ టైం అనే దాని  నుండి హంగ్రీ అనే పదాన్ని తీసుకున్నారు. వీరి రచనలు అశ్లీలంగా ఉన్నాయని వ్యవస్థకు వ్యతిరేకంగా ఉన్నాయని ప్రభుత్వం భావించి 1964 మలై రాయిచౌదరి తో సహా 11 మంది సభ్యులపై కేసు పెట్టి జైల్లో నిర్బంధించారు. ఈ ఉద్యమం బెంగాలీ సాహిత్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపునిచ్చింది. ముఖ్యంగా దిగంబర కవిత్వానికి ఈ హంగ్రీ జనరేషన్ ఉద్యమం ప్రేరణను ఇచ్చిందని విమర్శకుల అభిప్రాయం. ఈ రెండు ఉద్యమాలు 1960ల కాలం నాటి సామాజిక రాజకీయ వ్యవస్థలపై తిరుగుబాటుగా కనిపిస్తాయి.

ఈ రెండు ఉద్యమాలు ప్రేరణ, తిరుగుబాటు ధోరణి, భాష వంటి విషయాలలో ఒకే రకమైన ధోరణిని అవలంబించాయి. ముఖ్యంగా దిగంబర కవిత్వానికి ప్రేరణగా నిలిచాయని స్వయంగా దిగంబరకవులే ప్రకటించుకున్నారు. రెండవ సంపుటానికి రాసిన ముందుమాటలో "గబ్బు కొడుతున్న గడచిన చరిత్ర శవాన్ని మోస్తూ అభినవక్రీస్తులుగా తలపోస్తూ ప్రస్తుతం తమ అస్తిత్వం కోసం మార్జువానా మత్తులో తట పటాయింపుల నగర సంగీత గందరగోళంలో ఎటుపోలుపోకుండా నిలుచున్న బీట్ సోదరులు... అక్కడ తన బొజ్జ నునుపు కోసం పక్క వాడి పీక అతి చలాగ్గా హేలగా లీలగా ను లిమేసే రాజకీయ వేత్తలు పళ్ళికిలిస్తూ గొంతులన దుముతున్న చేతివేళ్ల క్రీనీడలలో నిరంతరం గుర్తు తెలియని ముఖాలు వేగంగా ప్రవహించే

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

కలకత్తా రోడ్ల పైన బంగాళీ తనం కోసం మనిషిని మరిచిన భారతీయ ఆత్మ కోసం విలపించే ఆకలి తరం యువకులు ... ఇక్కడ కోపంతో ఉద్రేకంతో తిరగబడి మత రక్త బాంధవ్యాల ముళ్ళ పొదలపై, శిధిల వ్యవస్థపై, జడత్వంపై ,సంచలనాన్ని లేవదీసి, మరో మహత్తర వ్యవస్థ కోసం తపన పడుతున్న కోపోద్రిక్త యువకుల నడుమ సంప్రదాయాల సంకెళ్ళకి, చరిత్రలో చిరిగిపోయిన పేజీలకి తమను అమ్మేసుకున్న గొర్రెలు, స్వార్థంతో, కృత్రిమత్వంతో, తమ ముఖాన్ని తామే రంగు కాగితాలతో అతికేసుకున్న గాడిదలు, డబ్బు కోసం, భవనాల కోసం, పదవుల సోపానాల కోసం, విగ్రహాల కోసం, ప్రజల నాలికలు కుట్టేసి కాలాన్ని వెనక్కి ఇంకా వెనక్కి గుంజాలనే ప్రయత్నం ముమ్మరంగా సాగుతున్న చోట, భయంకరంగా ఈ తరానికి కాస్త కాస్త విషం ఎక్కిస్తున్న చోట మీ ముందుకు దిగంబరకవులు... (పుట 91 దిగంబర కవులు.) అంటూ బీచ్ సోదరుల గందరగోళాన్ని కలకత్తాలో హంగ్రీ జనరేషన్ పేరుతో తిరగబడ్డ ఆకలి తరం యువకుల్ని ప్రస్తావిస్తూ వారి సరసనే తమను చేర్చుకున్నారు. పైగా వారి కంటే ఇంకా స్పష్టమైన అవగాహనతో తామున్నామన్నారు. సాహిత్యంలో, ఆనాటి జీవితంలో, రాజకీయ వ్యవస్థలో, జడత్వాన్ని వరించిన ఆంధ్రదేశంలో, వారేం కోరుకుంటున్నారు. వారి తాత్విక దృక్కోణం ఏమిటో విస్పష్టంగా తెలియజేశారు.... సాహిత్యంలో నాటి రచనల్లో జీవితంలోని నిజాయితీని సరళత్వాన్ని యుగ సందేశాన్ని అనుభూతుల అభివ్యక్తిని ఊపిరిగా పిల్చగల ఆధునిక మానవుని అస్తిత్వం ఆవిష్కరించబడాలని వీరు కోరుకొన్నారు.

నాటి జీవితాల్ని ప్రస్తావిస్తూ సమకాలీన యుగంలో వ్యక్తి తనతోనే తాను యుద్ధం చేస్తున్నాడు అంటూ ధనం వెనక పిచ్చివాడై, సుఖం లాలస వెనుక కుక్కలా తిరుగుతున్నాడని తన నీడను చూసి భయవిహ్వలుడై మిగిలిపోతున్నాడని విమర్శించారు. పని చేస్తూ, తింటూ, పిల్లల్ని కంటూ పశువు కంటే హీనంగా ఏమాత్రం అస్తిత్వం లేకుండా ఇవాల్టి మనిషి బతుకుతున్నాడు అంటారు నిజమైన అస్తిత్వం మనసుని సర్వదా సచేతనంగా ఉంచి అందరిలోనూ నిలబడి తనలో తాను జీవించడం గా అభివర్ణించారు అణువ భ్యున్నతిలో మనిషి ఈ ధరాతలంలో తప్పిపోయాడని అతని ఆత్మను పట్టియిచ్చి మనిషిని మనిషిగా చూడాలని అదే తమ కోరిక అని అభిలాషించారు దిగంబరకవులు.

సమకాలీన రాజకీయ వ్యవస్థల గురించి దిగంబరకవులు తమ అభిప్రాయాలను స్పష్టం చేశారు మానవ సంక్షేమం కోసం వ్యక్తిని మరింత ఉన్నతంగా మలచడం కోసం పుట్టిన ఈ మతాలు సిద్ధాంతాలు కాలం మారుతున్న కొద్ది చరిత్ర పురోగమిస్తున్న కొద్ది వాటి స్వరూప స్వభావాలు కూడా పూర్తిగా మార్చుకుని కేవలం బేసిజంగాను ఏ కొద్ది మంది వ్యక్తుల స్వార్థపరుల అధికార దాహానికి ఆలంబనగాను మిగిలిపోవడం జరుగుతుంది... అంటారు. అంతర్జాతీయ రాజకీయ రంగంలో మనిషిని పణంగా పెట్టి ఇజాల పాచికలతో

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

మాయాజూదం ఆడరాదని చిత్తశుద్ధి నిజాయితీపై ఆధారపడిన సంఘ వ్యవస్థ, రాజకీయ దృక్పథం రూపొందించాలని ఆశించారు ఈనాటి రాజకీయాలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం జరగాలంటారు. సమకాలీన ఆంధ్రదేశపు పోకడలను కూడా ఈ సందర్భంగా దుయ్యబట్టారు ప్రపంచం ఇంత గందరగోళంలో ఉన్నా ఆంధ్రదేశం మాత్రం ఏమి పట్టనట్టు నిద్రపోతుందని పాలేరు మనస్తత్వం గల పాలకులు, వెన్నెముక లేని యువకులు, నవ్య సాహిత్యాన్ని ఇంకా మట్టి సుద్దలతో తూచే మహానుభావులు, మైధున కవిత్వంలో ఆధునికులమనుకునే క్షుద్ర శవభోగులు, సినిమాలో ప్రమోషన్లుగా మారిన గుమస్తా మనస్తత్వం గల కళాకారులు, అకాడమీలు, ఈ సంస్థలు, ఈ పత్రికలు అందర్నీ బట్టలొలిచి దిగంబర కవిత్వం కొరడా కొసల్ని రుచి చూపించాలని వీళ్ళ జబ్బు బావితరాలకు అంటకుండా శస్త్ర చికిత్స జరగాలని ఈ సిఫిలిస్ గాళ్ళని రోగం నయమయ్యేంతవరకు దూరంగా ఉంచాలని తీవ్ర స్వరంతో హెచ్చరించాడు. "కాస్మిక్ జాతి కోసం "అనే కవితలో నగ్నముని. కోడిపందాలకి గొర్రె పందాలకి కుత్తుకలు తెగ్గోసుకునే ఆంధ్రదేశమా..,. నీ రోడ్లని గొడ్లని లారీల్ని మైకా గనుల్ని టెండర్లని కాంట్రాక్టర్లని మాదాకవళం మేధావుల్ని ఎండల్ని కల్లుకుండల్ని పొగాకు పైకాన్ని వంటింటి పత్రికల్ని ఇల్లు తగలబెట్టుకునే సహజీవనాన్ని బుర్ర పెంచుకు తిరిగే సెంటిమెంట్ల అంట్ల వెధవల్ని, వెలుగు ముఖం చూడని వర్తకుల్ని...... అగరమేలని అనాధ శరణాలయాలని...... నీ వేల సంవత్సరాల గొడ్రాలు సంస్కృతిని ఏ దేశమేగినా ఎందుకాలిడినా.... కారంలో పొర్లించిన రోకలితో పట్టపగలు విషయించాలని ఉంది....అని తీవ్రమైన పదజాలంతో దూషించాడు. (దిక్-1, దిగంబర కవులు సంపుటి రెండు) ఆనాటి సినిమా కళల్ని ఉద్దేశించి కూడా తీవ్ర విమర్శ చేశారు దిగంబరకవులు.

ఇంకా ఈ ప్రదేశంలో మరో రకమైన మదపిచ్చుగా తయారైంది సినిమా దేశాన్ని కుష్టులాగా పట్టుకుంటున్న ఈ వెర్రి ప్రభావం తగ్గి ఆరోగ్యకరమైన విజ్ఞానం వినోదంగా కళాకారుడి నిజమైన స్వప్నవిష్కరణగా సినిమా తయారు కావాలి అని కాంక్షించారు. దిగంబర కవిత్వంలో భాష అశ్లీలంగా ఉన్నదన్న విమర్శకు దిగంబరకవులు తీవ్రంగా స్పందించారు. నగ్నముని కొజ్జాల కామకేళి చూస్తున్నాను అన్న కవితలో విస్పష్టంగా సమాధానం చెప్పారు... అశ్లీలం పలుకుతుంది దిగంబరాక్షరం అంటున్నావు సిగ్గు లేకుండా... నీకు ప్రతిదానిలోనూ అశ్లీలం కాక మరేం కనబడుతుంది బాహాటంగా పట్టపగలు జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు అమానుషాలు ఉన్నది ఉన్నట్లు చెబితే నీకు అశ్లీలంగానే కనబడుతుంది నల్లబజారు పగటి బజార్లు కంటే రొమ్ము విరుచుకు రోడ్లపై నడుస్తున్నాయంటే నీకు అశ్లీలంగానే వినబడుతుంది తోలు వ్యాపారస్తులు నీతి బోధనలు చేస్తున్నారు రా అంటే నీకు అశ్లీలంగానే

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

వినబడుతుంది. రాజకీయ రంకు భక్తులు ఇసుక నైవేద్యపు కాంట్రాక్టర్లు ఉడతా భక్తి వాటాదారులు.. పంట పొలం నిండా కలుపు మొక్కలలా ధాన్యాగారం నిండా పందికొక్కులు లా బలిసిపోయినారంటే నీకు అశ్లీలంగానే వినపడుతుంది...... వాడు ఆ రాస్కెల్ ఆ బొజ్జ లంజా కొడుకు మన అభ్యుదయాన్ని గూర్చి మైకు బద్దలు కొడుతున్న వాడు క్షణంలో లక్షాధికారి ఎట్లా అయినాడు అని అడిగితే అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది ఈ కులాలు ఈ కలహాలు ఎందుకురా అని ప్రశ్నిస్తే అది నీకు అశ్లీలంగానే వినపడుతుంది ఈ మౌఢ్యలూ ఎక్కడికి రా అని ప్రశ్నిస్తే అది నీకు అశ్లీలంగానే వినబడుతుంది... ఈ గతుకుల జీవితపు రోడ్లు ఈ కుమ్ములాటలు ఈ ఓట్ల కోసం చంపుకోవడాలు పొడుచుకోవడాలు ఈ తాగుడు పోయడాలు ఈ తా ర్చడాలు ఈ ప్రజలే ఎదురు తిరిగి పరిపాలన మార్చలేరా అని కుమిలిపోతే అది నీకు అశ్లీలంగానే వినపడుతుంది.. అని విమర్శలు తిప్పి కొట్టారు అశ్లీల సమాజానికి అశ్లీల భాషతోని సమాధానం చెప్పాలని భావించారు.

అలాగే కుల రహిత మత ప్రమేయం లేని ఒక సామాజిక వ్యవస్థ ని కలలు కన్నా ఈ కవులు దిగంబరత్వం అంటే ఏమిటో స్పష్టంగా నిర్వహించారు ఈ సమాజంలో మనిషన్నవాడు తన ఉనికిని సమాజాన్ని గుర్తించాలంటే నిజాన్ని నిజంగా చూడాలి నిజానికి ఏమి ముసుగులు ఉండవు అందువల్ల యదార్థాన్ని వాస్తవాన్ని చెప్పడానికి ముసుగులు తొలగించడానికి దిగంబరత్వాన్ని ఉపయోగించాలి అందుకే నగ్నముని "సుఖరోగి" అన్న కవితలో నిజాన్ని చెప్పలేక నిర్మలంగా బతకలేక ముసుగు నీ ముఖం నిండా కప్పుకున్న బురదని భాష నిండా నింపుకున్న నిన్ను చూస్తే నాకెందుకు ద్వేషం అంటాడు ముసుగుని తొలగించు ఈ కంపుకొట్టే బట్టలను విప్పి ఆత్మ ముందు నిలబడి నిన్ను నువ్వు చూసుకో అని హెచ్చరిస్తాడు ...ఇంకా "దిగంబరం కావాలి" అనే కవితలో చర్మం దిగంబరం కావాలి, సిరులు దిగంబరం కావాలి ,ధమనులు దిగంబరం కావాలి, చీము నెత్తురు దిగంబరం కావాలి, సిగ్గు శరము దిగంబరం కావాలి, నేల దిగంబరం కావాలి, నింగి దిగంబరం కావాలి, ఆడదయి తే దిగంబరం కావాలి, మగాడైతే దిగంబరం కావాలి, ప్రజలు దిగంబరం కావాలి, దేశాలు దిగంబరం కావాలి, మతాలు ఇజాలు దిగంబరం కావాలి, యంత్రాలనట్లు నాగరికతలు పటకార్లు దిగంబరం కావాలి ,భజంత్రీలు బాంబులు దిగంబరం కావాలి. పెళ్లిళ్లు చావులు రోగాలు రొంపులు దిగంబరం కావాలి. పరిసరాలన్నీ దిగంబరం కావాలి ప్రపంచం దిగంబరం కావాలి, విశ్వం దిగంబరం కావాలి,ఒరేయ్ పశువా! మొట్టమొదట చిట్టచివరి కొమ్మన మనసు దిగంబరం కావాలి ...అని ముసుగుని బట్టబయలు చేశాడు. దిగంబరం అంటే ఆకాశం దీనికి హద్దులు ఉండవు. ఆవేశానికి ఆకాంక్షలకి తిరుగుబాటుకి హద్దులు అనేవి ఉండవు ఎందుకంటే అది సమాజంలో మార్పుని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

కోరుకుంటుంది. ఆ లక్ష్యంతోనే దిగంబరకవులు కవిత్వాన్ని ప్రారంభించారు మొదటి సంపుటి లో మహా స్వప్న రాసిన "గ్లానిర్భవతి భారత" ఈ విషయం స్పష్టం చేస్తుంది... కలియుగం రేడియో గ్రాములో గిరగిరా తిరుగుతున్న క్రీ.శ. 20వ శతాబ్ది రికార్డు మీద పిన్నునై మానవతా రెండు కళ్ళు మూసుకుపోయినప్పుడు విప్పుకుంటున్న మూడో కన్నునై కాలం వాయు లీనం మీద కమానునై చరిత్ర నిద్రాసముద్రం మీద తుఫాను నై నేను వస్తున్నాను దిగంబరకవిని.... రాత్రి ఉదయిస్తున్న రవిని ...అని సగర్వంగా ప్రకటించాడు నాటేసిన చెట్లను నడిపించేందుకు , పాతేసిన రాళ్ళను పలికించేందుకు, గోరీల్లో శవాలకి పునరుద్ధానం కలిగించేందుకు, మరణించిన భగవంతునికి ప్రాణం పోసేందుకు వస్తున్నాను అంటాడు.

దిగంబర కవుల రెండో సంపుటిలో ఈ సమాజానికి దిశా నిర్దేశం ఎలా జరగాలి ఏ పద్ధతిలో ఈ సమాజం ఉంటే బాగుంటుంది అనేక కులాలు మతాలు వైరుధ్యాలు వర్గ భేదాలు ఉన్న ఈ సమాజం ఏ దిశలో మారితే బాగుంటుందనే ఉద్దేశంలో దిగంబరకవులు మార్క్సయిన్ తాత్విక శాస్త్రాన్ని అంగీకరించారు నమ్మారు ఈ భూగోళం పైన ఆకలి, దారిద్ర్యం ఉన్నంతకాలం మార్క్సిస్ట్ చింతనని సవాలు చేసే అధికారం ఎవరికి లేదు. మార్క్సిస్టు చింతన శాస్త్రీయ భావజాలం, గతి తార్కిక భౌతిక చింతన ద్వారా ప్రకృతిని మనిషిని అధ్యయనం చేసింది కాబట్టి ఈ సమాజం మారడానికి ఒక రకంగా ఇది దారి చూపుతోందని నమ్మి దిగంబరకవులు మార్క్సిస్టు దృక్పధాన్ని ఆశ్రయించడం రెండవ సంపుటిలో కనిపిస్తుంది. కాస్మిక్ జాతి కోసం వంటి బలమైన కవితతో నగ్నముని, నా దేశంలో నేను ఏకాకిని, విలపిస్తున్న దీనత్వం వంటి కవితలతో నిఖిలేశ్వర్ ,ఆకాశం ఎక్కి ఏడుస్తుంది వంటి కవితలతో చెరబండరాజు , చెరచబడ్డ గీతాన్ని కరువు బిచ్చం వంటి కవితలతో భైరవయ్య, పునర్ యోని ప్రవేశం, కిలికించితం వంటి కవితలతో జ్వాలాముఖి ఈ నమ్మకాన్ని మరింత బలోపేతం చేశారు.

ఇక మూడో సంపుటం లో మార్క్సిస్టు దిశలు సమాజం ప్రయాణిస్తున్నప్పుడు రచయితలు శ్రామిక వర్గం మేధావులు ఏం చేస్తే బాగుంటుందని ఆలోచిస్తుంది దిగంబర కవిత భారతదేశంలో ఆనాటికి అంటే 68 70 ల నాటికి నక్సల్ బరీ పోరాటం శ్రీకాకుళం గిరిజన ఉద్యమాలు కవులను బలంగా ప్రేరేపించాయి ఆ ప్రభావం మూడో సంపుటిలో కనిపిస్తుంది అవిద్యని అజ్ఞానాన్ని అసప్తుతని ఆసరాగా తీసుకొని దేశాన్ని దోచుకు తినడం మరిగిన పరిపాలకులు సంఘంలోని వివిధ వర్గాల వాళ్ళు నేడు ప్రజలపై రుద్దుతున్న కుష్టు వ్యవస్థను ఎదుర్కొంటూ దిగంబర్ కవులు పలికిన దిక్కులను జ్వాలనామ సంవత్సరం సరిగ్గా క్రీస్తుశకం 1968 జూన్ లో దిగంబర కవితా ప్రచురణ కనిపిస్తున్నది . చెరబండ రాజు వందేమాతరం నగ్నముని కొజ్జాల కామకేళి చూస్తున్నాను, తొడ విరిగిన తనం, దిగంబరం కావాలి జ్వాలాముఖి ఓటమి తిరుగుబాటు వంటి

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

బలమైన అభివ్యక్తి కలిగిన కవితలు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా జ్వాలాముఖి "ఓటమి తిరుగుబాటు" తాడిత పీడిత ప్రజానీకం తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకొని.... పడిపోయిన తుపాకీ నెత్తి చూసాడు తుపాకీ గొట్టంలో దాగిన విప్లవ సామ్రాజ్యాల విజయదుందుభుల ప్రతిధ్వనులు ఆహ్వానించడం కనిపిస్తుంది. మూలనున్న విశ్వాసం క్షతగాత్రున్ని తన ఏకైక తిరుగుబాటు వీరున్ని తనలోకి లేవనెత్తి తుపాకీ నీ చేతికి ఆధారం చేసుకుని చరచరా ముందుకు నడిచాడు. వాడు ఎవడు వాడు వాడంటే వాడు తూర్పు పేలి పగులుతున్నచప్పుడు ఎరుపై దగ్గరలో వినబడుతున్నది భరతవాక్యం బలంగా కనబడుతున్నది .....అని ముగిస్తాడు కవి విప్లవోద్యమం వైపు యువతని నడిపించడం ఈ సంపుటిలో కనిపించింది.

**ముగింపు:** మూడవ సంపుట ముగింపులు వీరి ముక్తాయింపు మాటలు చదివినప్పుడు 1968 నాటి సామాజిక పరిస్థితులే ఈనాడు కూడా ఉన్నాయి అనిపిస్తుంది. ఈ దేశంలో ఈ 20 ఏళ్ల స్వాతంత్ర్యంలో భయంకరంగా విజృంభించిన కుల మత దురహంకారానికి ధనమదంతో యదేచ్ఛగా ప్రజాస్వామ్యాన్ని వాడుకుంటున్న గూండాయిజానికి సినిమా రొంపిలో ఈదులాడుతున్న యువతరం బలహీనతకి స్తోత్ర పాఠాల కుడితిలో పడిపోయిన పత్రికా లోకపు పడుపు జీవనానికి అతీత జీవనంతో తప్పించుకు బతుకుతున్న మేధావుల అనాసక్తతకి నాయకుల ఊసరవెల్లి ఆదర్శాలకి పదవి వ్యాపారాలకి నేటి ఈ కుష్టు వ్యవస్థకి క్రూరంగా బలహీన కంచర్ల కోటేష్ కి అని ముగించారు.

సరిగ్గా ఈనాటి సమాజ స్థితి కూడా ఇలాగే ఉంది కనుకనే ఈ దిగంబర కవిత్వానికి ఈనాడు ఎంతో రిలవెన్స్ ఉంది ఒక సమాజానికి అవసరమైనట్టుగా రాసిన కవిత్వం ఏనాటి సమాజానికైనా సరిపోయినప్పుడు అది గొప్ప సాహిత్యం అవుతుంది. సాహిత్యంలో సార్వకాలికత సార్వజనీనత అని దీన్నే అనవచ్చు సాహిత్యానికి ఈ లక్షణం ఉంటే అది గొప్ప సాహిత్యమే దాన్ని సృష్టించిన వారు నవయుగవైతాళికులే. రాచమల్లు రామచంద్రారెడ్డి కొడవటిగంటి కుటుంబరావు వేల్చేరు నారాయణరావు వంటి సుప్రసిద్ధ విమర్శకులు ఈ కవిత్వాన్ని విమర్శించినా శ్రీ శ్రీ మాత్రం దిగంబర కవిత్వాన్ని మెచ్చుకోవడమే కాకుండా ఆంగ్లంలోనికి కూడా అనువదించి తన అభిమానాన్ని చాటుకున్నాడు బూతులు అస్పృశ్యంగా చూడడం మనలో ఉన్న ఒక రకమైన పిరికితనం కారణం దిగంబర కవితలు స్పందన సెక్స్ వైపు వెళ్ళనీయదు సమాజాన్ని ఉన్నది ఉన్నట్టుగా చిత్రించడమే దిగంబర కవిత అని భైరవయ్య రాసినట్లుగా దిగంబర కవిత్వం విప్లవ కవిత్వంలో కలిసిపోయే వరకు ఆ ఆలోచనతోనే ముందుకు సాగింది. విప్లవ కవిత్వద్యమానికి బాటలు వేసి తెలుగు సాహిత్యంలో తన పాత్రను అపూర్వంగా పోషించినది.

ISSN:3048-5908
Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

**ఆధార గ్రంధాలు:**

దిగంబర కవులు: సాహితీ మిత్రులు ప్రచురణ (మూడు సంపుటాలు)

తెలుగు సాహిత్య సమీక్ష ( రెండవ సంపుటం) ఆచార్య జి నాగయ్య. నవ్య పరిశోధక ప్రచురణలు

ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు ప్రయోగములు: డాక్టర్ సి నారాయణ రెడ్డి